క్లుప్తంగా

యువత డ్రగ్స్‌కి దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ అప్పలరాజు

పాయకరావుపేట : యువత, విద్యార్థులు డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని, ఆరోగ్యాలు పాడు చేసుకోకూడదని సీఐ పి.అప్పలరాజు అన్నారు. హైమా నేత్రాలయం సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి చదువు, క్రీడలపై దృష్టి సారిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.శాంతి, నేత్రాలయం ఎండీ పీఎస్ఆర్ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వల్లభ నారాయణస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీదేవి, భూదేవి సమేత వల్లభనారాయణ స్వామి

రాంబిల్లి: దిమిలిలో వల్లభ నారాయణస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మార్గశిర గురువారం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత వల్లభ నారాయస్వామికి నూతన వస్త్ర, పుష్పాలంకరణ చేశారు. ఆలయ అర్చకులు నేతేటి రామచంద్రాచార్యులు, నేతేటి గోపాలకృష్ణ శాస్త్రోక్తంగా పూజలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పాయకరావుపేట : కాంగ్రెస్ పార్టీ 138వ ఆవిర్భావ దినోత్సవం పట్టణంలో గురువారం నిర్వహించారు. పీసీసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జగతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. అనంతరం స్వర్గీయ ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం మెయిన్‌రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మారుతి నారాయణ, చక్రవర్తి, పోలవరపు అప్పలరాజు, మోర్త సింహాచలం, గారా సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



ఆయుష్మాన్ భారత్ కార్డు అందిస్తున్న దృశ్యం

రాంబిల్లి: గోకివాడలో గురువారం వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ నీరుకొండ శారద, ఎంపీటీసీ అల్లవరపు బాబ్జీ, సచివాలయ కన్వీనర్ ద్వారపురెడ్డి గోవిందరావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను అధికారులు వివరించారు. లబ్ధిదారులకు ఆయుష్మాన్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఈవో పీఆర్డీ రామకృష్ణరాజు, దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్.వెంకటేష్, పాలసంఘం అధ్యక్షుడు నందవరపు రాఘవ పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

పాయకరావుపేట : పట్టణంలోని చిత్రమందిర్ థియేటర్ వెనుక గల ఐ ఓపెనర్స్ కార్యాలయం వద్ద సంస్థ డైరెక్టర్ డాక్టర్ కుమార్ ఆర్‌కే ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సెంట్రల్ అమెరికాకు చెందిన డాక్టర్ లూయిస్, రాజమండ్రికి చెందిన రిటైర్డ్ డీజీఎం అజయ్ పాల్, డాక్టర్ డానియేల్, నిర్మల, పాస్టర్ డాక్టర్ కె. జాన్ డేవిడ్, సిబ్బంది సతీష్, శివ, అయ్యారావు, పండు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు
- చురుగ్గా పాల్గొంటున్న యువత
- పల్లెలు, పట్టణాలకు క్రీడా శోభ



కోటవురట్లలో షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న యువతులు



రాజానగరంలో వాలీబాల్ ఆడుతున్న యువకులు

పాయకరావుపేట : 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు చురుగ్గా జరుగుతున్నాయి. మండలంలో గల 25 గ్రామ సచివాలయాల పరిధిలో యువకులు ఉల్లాసంగా పోటీల్లో పాల్గొంటున్నారు. గ్రామ సచివాలయ కార్యదర్శి, సిబ్బంది, వలంటీర్లు చురుగ్గా విధులు నిర్వహిస్తున్నారు. 110 టీమ్‌లు వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నాయి. ఎంపీడీవో, ఈవోఆర్డీలు ఎ.సాంబశివరావు, సీహెచ్ చంద్రశేఖర్ క్రీడా పోటీలను స్వయంగా పరిశీలిస్తున్నారు. ఆయా గ్రామ సచివాలయ కార్యదర్శులు, పోటీలకు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. మండలంలో గల మాసాహేబుపేట, అరట్లకోట, పాల్తేరు, ఈదటం, పాల్మన్‌పేట తదితర గ్రామాల్లో ఆటల పోటీలు చురుగ్గా జరుగుతున్నాయి.

కోటవురట్లలో..

కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల పరిషత్ ఏవో చంద్రశేఖర్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో క్రీడాకారులు ఆడుదాం ఆంధ్రా పోటీల్లో షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు. సర్పంచ్ బి.అనిల్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు గణేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు రామునాయుడు పాల్గొన్నారు.

గుడివాడలో..

ఎస్.రాయవరం: గుడివాడ గ్రామంలో ఖోఖో వాలీబాల్, కబడ్డీ, మండల కేంద్రం ఎస్.రాయవరం సచివాలయంలో వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకుల సహకారంతో క్రీడాకారులు ఉదయం 9 గంటలకే మైదానానికి చేరుకుని ఆటలు ఆడారు. మరిన్ని గ్రామాల్లో శుక్రవారం నుంచి క్రీడలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు.

మునగపాక హైస్కూల్లో..

మునగపాక : స్థానిక హైస్కూల్లో ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా కబడ్డీ పోటీలు జరిగాయి. మహిళలు, పురుషుల విభాగంలో వేర్వేరుగా ఈ పోటీలు నిర్వహించారు. అలాగే తిమ్మరాజుపేట హైస్కూల్లో కూడా కబడ్డీ పోటీలు జరిగాయి.

రాంబిల్లిలో..

రాంబిల్లి: ఆడుదాం ఆంధ్ర పోటీలు మండలంలోని పలు గ్రామాల్లో ఉత్సాహంగా జరుగుతున్నాయి. గురువారం పలు గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలు ఖోఖో, బ్యాడ్మింటన్ ఆటల్లో పాల్గొన్నారు. మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆటల పోటీలను పర్యవేక్షించారు.



కొప్పుగొండుపాలెంలో ఖోఖో ఆడుతున్న యువతులు



ఎస్.రాయవరంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



మునగపాక హైస్కూల్లో కబడ్డీ ఆడుతున్న యువతులు



గుడివాడలో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు

- ఎమ్మెల్యే కన్నబాబు
- షేకిళ్లపాలెంలో కొత్త సచివాలయ భవనం ప్రారంభం



షేకిళ్లపాలెం సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

యలమంచిలి: గ్రామాల్లో ప్రజల చెంతకే అన్ని సేవలు చేరువయ్యేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను అమల్లోకి తెచ్చారని ఎమ్మెల్యే కన్నబాబు అన్నారు. మండలంలోని షేకిళ్లపాలెంలో రూ.43.60 లక్షలతో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, కొత్తగా నిర్మించిన రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ ప్రజలకు సచివాలయాలు ,రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్నా మండల కేంద్రాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ఆ అవస్థలకు చెక్ పెట్టారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంతో దూరదృష్టితో ఇవన్నీ చేస్తున్నారని, ప్రజలంతా దీనిని గమనించి మరోసారి ఆయన్ను సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర, రాజాన మహాలక్ష్మి, సేనాపతి రాము, కొల్లి త్రినాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రగ్గులు, వాటర్ బాటిళ్లు వితరణ



దివ్యాంగులకు రగ్గులు, వాటర్‌బాటిళ్లు అందిస్తున్న ఎంపీపీ జయమ్మ

చీడికాడ: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దివ్యాంగులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తూ వారి ఉన్నతికి చర్యలు తీసుకుంటున్నారని ఎంపీపీ కురచా జయమ్మ అన్నారు. గురువారం తురువోలు భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచాలకు చెందిన ప్రత్యేక ఉపాధ్యాయుడు బొడ్డు మహాలక్ష్మీనాయుడు తన సొంత నిధులతో దివ్యాంగులకు రగ్గులు, వాటర్‌బాటిళ్లు వితరణ చేశారు. వాటిని ఎంపీపీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో బొంజుబాబు, సర్పంచ్ మట్టా అప్పారావు, ఉప సర్పంచ్ పి.టి. బాబు, సరస్వతి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి సన్నిధిలో ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



కుంకుమపూజలు చేస్తున్న మహిళలు

- నేత్రపర్వంగా మార్గశిర గురువార పూజలు
- అమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

యలమంచిలి రూరల్: మార్గశిర మాసం మూడో గురువారం సందర్భంగా ధర్మవరం కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున అర్చకులు కోటి పంతులు అమ్మవారికి అభిషేకం చేసి, ప్రత్యేక అలంకరణల అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యూలైన్లు నిండిపోయాయి. ఆలయ ప్రాంగణంలో మహిళలతో సామూహిక కుంకుమార్చన, అష్టోత్తర శతనామార్చన నిర్వహించారు. కుంకుమార్చనల అనంతరం అమ్మవారికి ప్రత్యేక హారతులిచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆలయం రద్దీగా కన్పించింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

కొత్తకోటలో దుకాణ సముదాయం ప్రారంభం నేడు



నూతన దుకాణ సముదాయం

రావికమతం: అందుబాటులోని వనరులను సద్వినియోగించుకుని పంచాయతీలు ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్న లక్ష్యంతో కొత్తకోట మేజర్ పంచాయతీలో నాబార్డు రుణ సహాయంతో నిర్మించిన దుకాణ సముదాయం శుక్రవారం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా మాట్లాడుతూ సంతల్లో గ్రామీణులకు వారానికి సరిపడా నిత్యావసరాలు లభిస్తాయన్నారు. చోడవరం తర్వాత పెద్ద గ్రామమైన కొత్తకోటలో ఇటువంటి దుకాణ సముదాయం నిర్మిస్తే ఇక్కడ చుట్టు పక్కల గ్రామాల ప్రజల అవసరాలు తీరడమేగాక పంచాయతీకి ఆదాయ వనరుగా ఉంటుందన్నారు. ఈ మేరకు పంచాయతీ నుంచి రూ.3 లక్షలు, నాబార్డు నుంచి రూ.15 లక్షలతో దుకాణ సముదాయాలు పూర్తి చేశామన్నారు. త్వరలోనే గిడ్డంగుల తోపాటు కోల్డ్ స్టోరేజీలు నిర్మించేందుకు ప్రభుత్వ విప్ ధర్మశ్రీ హామీ ఇచ్చారన్నారు. వీటి వల్ల రోడ్డుకు ఇరువైపులా చిరుదుకాణదారుల బెడద లేకుండా ఇక్కడ ఏర్పాటు చేసుకోవచ్చని, తద్వారా ట్రాఫిక్ కష్టాలు తొలగుతాయన్నారు.

'ధనిశెట్టి'కి పలువురి శుభాకాంక్షలు



ధనిశెట్టికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

పాయకరావుపేట : వైఎస్సార్‌సీపీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు జన్మదినం సందర్భంగా గురువారం పలువురు నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ధనిశెట్టి బాబూరావు స్వగృహంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ (మాల) కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజీ, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు దేవవరపు సూర్యచక్రం, జెడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, సర్పంచ్ గారా ఉషశ్రీ ప్రసాద్, ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పల్లేల స్వామి, ధనిశెట్టి మాధవి తిరుమల్లేశ్వరరావు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు కాధా రామకృష్ణ, అన్నవరం దేవస్థానం డైరెక్టర్ దోమాడ సుందర్రావు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డి.నానాజీ, బీసీ సెల్ నాయకుడు కేశనకుర్తి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

రోలుగుంట: మండలంలో జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు యూటీఎఫ్ మండలాధ్యక్షుడు కాళింగ సతీష్ గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ యూనియన్ నిధులతో నిష్ణాతులతో ఈ మెటీరియల్ తయారు చేయించామన్నారు. వీటిని పదో తరగతి విద్యార్థులు చదువుకుని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య

- యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు
- తులసీనగర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులకు ట్యాబ్‌ల పంపిణీ



జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

యలమంచిలి రూరల్: పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉచిత విద్యను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలు చేశారని యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. యలమంచిలి తులసీనగర్ జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థినులకు గురువారం సాయంత్రం ఆయన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినుల తల్లిదండ్రులనుద్దేశించి మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యను బలోపేతం చేసేందుకు వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసిందన్నారు. నాడు-నేడుతో బడుల రూపురేఖలను సమూలంగా మార్చారన్నారు. ప్రభుత్వ బడుల్లో డిజిటల్ బోధన ద్వారా విద్యార్థులకు హైస్కూల్ స్థాయి నుంచే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడానికే సీఎం జగన్ విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు అందజేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యా విధానంలో తీసుకొచ్చిన మార్పుల కారణంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడి విద్యా ప్రమాణాల ఉన్నతికి దోహదపడుతున్నాయన్నారు. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులంతా ఐఐటీ, ఐఐఎం స్థాయి చదువులు చదివి మంచి స్థాయికి చేరుకోవాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, ఎంపీపీ బోదెపు గోవిందు, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర, సేనాపతి రాము, దాసరి కుమార్, ఎంఈవో మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై ఆగ్రహం

పాఠశాలలో మధ్యాహ్న భోజనం బాగాలేదని కొంతమంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఆయన జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని హిమబిందుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం జగనన్న గోరుముద్ద కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంటే ఇక్కడ ఫిర్యాదు ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. తాను పరిశీలించిన ఏ పాఠశాలలోనూ ఫిర్యాదు రాలేదని, ఇకపై ఫిర్యాదు రాకుండా చూసుకోవాలని సూచించారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి



దివ్యాంగులకు దుప్పట్లు అందిస్తున్న సర్పంచ్ అనిల్‌కుమార్ తదితరులు

కోటవురట్ల : విభిన్న ప్రతిభావంతుల్లో దాగున్న నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు వస్తాయని సర్పంచ్ బి.అనిల్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మేము సైతం వికలాంగుల మండల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ మహిళా కార్యదర్శి జి.వరలక్ష్మి మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల దృష్ట్యా వికలాంగులకు పోషణ కష్టంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న పింఛను రూ.3 వేల నుంచి రూ.7 వేలకు పెంచాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో దివ్యాంగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని, విడిగా రేషన్ కార్డు మంజూరు చేయాలని, దివ్యాంగులకు కమ్యూనిటీ హాళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అనంతరం దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు వి.గంగునాయుడు, కార్యదర్శి కుమార్, మండల పరిషత్ ఏవో చంద్రశేఖర్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, జైహో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు హెటెరో ప్రోత్సాహకాలు



విద్యార్థులకు చెక్కును అందిస్తున్న హెటెరో సిబ్బంది

నక్కపల్లి: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు హెటెరో కంపెనీ యాజమాన్యం నగదు పురస్కారాలను అందించింది. గురువారం వేంపాడు జెడ్పీ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సుబ్బారెడ్డి, కుల్లాయి రెడ్డిలు ఉత్తమ ఫలితాలు సాధించిన 21 మందికి మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.7,500, మూడో బహుమతిగా రూ.5 వేలు అందించారు. వివిధ పాఠశాలల్లో చదువుతున్న 1200 మంది టెన్త్ విద్యార్థులకు రూ.3 లక్షల విలువైన స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వేంపాడు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ అయినంపూడి మణిరాజు, సర్పంచ్ నూకరత్నం, ఉప విద్యాశాఖాధికారి కె.అప్పారావు, ఎంఈవో కె.నరేష్, హెచ్‌ఎం వి.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎ.భీమవరంలో చెరకు రవాణా ప్రారంభం



కాటా కేంద్రం వద్ద చెరకు వేస్తున్న శేషు, తాతయ్యబాబు

కె.కోటపాడు: ఎ.భీమవరం చెరకు తూనిక (కాటా) కేంద్రం నుంచి చెరకు రవాణా గురువారం ప్రారంభమైంది. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ ప్రారంభం కావడంతో చెరకు కాటాల నుంచి రైతులకు పర్మిట్లను ఫీల్డ్‌మెన్ జారీ చేస్తున్నారు. ఈ మేరకు ఇక్కడ కాటా నుంచి చెరకును తరలింపును వైఎస్సార్‌సీపీ నాయకుడు తర్రా శేషు, రైవాడ ప్రాజెక్టు మాజీ చైర్మన్ బొడ్డు తాతయ్యబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా తర్రా శేషు మాట్లాడుతూ ఎ.భీమవరం, కొత్తపెంట, అలమండ, ఎ.కొత్తపల్లి, పొడుగుపాలెం తదితర గ్రామాలకు చెందిన రైతులు ఏటా తూనికా కేంద్రం నుంచి 40 వేల టన్నుల చెరకును తరలించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డి.దేముళ్లు, తర్రా నారాయణరావు, తర్రా మోహన్‌రావు, కె.ధనుంజయ్, మడక సత్యనారాయణ పాల్గొన్నారు.